## క్లుప్తంగా

### ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక


బాషాసిద్దిక్


ఓర్సు ఇందిర

**అర్వపల్లి:** అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. 2023–24 సంవత్సరానికి గాను పాఠశాలకు చెందిన మహ్మద్ అస్లాంబాషాసిద్దిక్, ఓర్సు ఇందిరలు ఎంపికయ్యారని ఆపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. వీరికి 9 వతరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు 4 ఏళ్ల పాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా వీరిని ఆమె బుధవారం పాఠశాలలో అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 21న అర్వపల్లి వారాంతపు సంత వేలం పాట

**అర్వపల్లి:** అర్వపల్లిలో ప్రతి మంగళవారం జరిగే వారాంతపు సంత నిర్వహణకు ఏడాదికి గాను వేలంపాటను ఈ నెల 21న పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.సందీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రావణి తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.30 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

### వ్యవసాయ అధికారిగా మల్లారెడ్డి



**అర్వపల్లి:** జాజిరెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారిగా మల్లారెడ్డి బుధవారం రామన్నగూడెం రైతు వేదికలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన సూర్యాపేటలోని ఏడీఏ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. కాగా ఇక్కడి ఏఓ హైదరాబాద్‌లోని మార్క్‌ఫెడ్ సంస్థకు బదిలీ అయ్యారు.

### తిమ్మాపురం పీఏసీఎస్‌లో అందుబాటులో ఎరువులు

**అర్వపల్లి:** మండల పరిధిలోని తిమ్మాపురం పీఏసీఎస్‌లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయిని చైర్‌పర్సన్ మారిపెద్ది మంగమ్మ, సీఈఓ ఊర సత్యనారాయణ తెలిపారు. 444 బస్తాల యూరియా, 200 బస్తాల డీఏపీ, 200 బస్తాల 20.20.0.13 రకాల ఎరువులు వచ్చాయని, అవసరమైన రైతులు ఆధార్‌కార్డును వెంట తీసుకొని రావాలని సూచించారు.

### సబ్ మార్కెట్ యార్డును ప్రారంభించాలి

**అర్వపల్లి:** జాజిరెడ్డిగూడెంలో ఏడేళ్ల కిందట నిర్మించిన వ్యవసాయ సబ్ మార్కెట్ యార్డును వెంటనే ప్రారంభించి మిగిలిన అభివృద్ధి పనులు చేపట్టాలని జాజిరెడ్డిగూడెం సోషల్ ఫోరం కన్వీనర్ చొల్లేటి రమణ విజ్ఞప్తి చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రూ.1.55 కోట్లతో నిర్మించి అరకొర వసతులతో ఉన్న యార్డును ఇప్పటికైనా ప్రారంభించి మిగిలిన పనులను చేపట్టాలని ఎమ్మెల్యేకు సూచించారు. గత పాలకులు అరకొర వసతులతో నిర్మించి ప్రారంభాన్ని మరిచారని చెప్పారు.

### వీరమ్మ మృతికి సంతాపం


నివాళులర్పిస్తున్న తూముల సురేష్‌రావు

**పెన్‌పహాడ్ :** మండల పరిధిలోని నాగులపహాడ్ ఆవాసం దుబ్బగూడెం గ్రామానికి చెందిన నారాయణ వీరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మృతురాలి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు పరామర్శించారు. అనంతరం మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నారాయణ ప్రవీణ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మండలి పిచ్చయ్య, ఉమామహేశ్వర్‌రెడ్డి, సంకరమద్ది దామోదర్‌రెడ్డి, నారాయణ వెంకట్‌రెడ్డి, గార్లపాటి వెంకట్‌రెడ్డి, ఏపూరి నగేష్, పాపిరెడ్డి, శేఖర్‌రెడ్డి, జగ్గారెడ్డి, సందీప్, ఎదుళ్ల రాంరెడ్డి పాల్గొన్నారు.

### అనుమతిలేని కట్టడాలను తొలగించాలి

**మద్దిరాల :** మండల పరిధి పోలుమల్ల గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలను తొలగించాలని బీజేపీ మండల అధ్యక్షుడు భూతం సాగర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలుమల్ల గ్రామ శివారులోని 365 జాతీయ రహదారి వెంట ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు అనుమతులు లేకుండా కట్టడాలను నిర్మించారని తహసీల్దార్‌కు పలుమార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడంలేదన్నారు. వెంటనే సర్వే చేసి ఆ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# రైతు వేదికలు వెలవెల !

- నిరుపయోగంగా మారిన కేంద్రాలు
- రైతులకు అందని సలహాలు, సూచనలు
- అరకొర సాకర్యాలతో అవస్థలు

**పెన్‌పహాడ్:** రైతులకు వ్యవసాయంలో ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు వ్యవసాయ శాఖ పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రైతులకు ఎప్పటికప్పుడు సాగు వివరాలు, విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, పంటల అమ్మకాల్లో తోడ్పాటుగా ఉంటూ అన్ని అంశాల్లో అండగా ఉండాలనే ఉద్దేశంతో రైతు వేదికలు నిర్మించారు. వ్యవసాయ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించడం, సలహాలు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వం ప్రతి ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా గుర్తించి రూ. 22లక్షలతో రైతు వేదికలు నిర్మించింది. అయితే రైతు వేదికల్లో ఏఈఓలు ఈ వానాకాలంలో విత్తనాల గురించి వివరించే ఆలోచనే లేదు. పంటలు వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదుకే పరిమితమవుతున్నారు. తప్ప ఇతర కార్యకలాపాలు నిర్వహించడం లేదు.

**మండలంలో ఐదు వేదికలు**

మండలంలో అనాజిపురం, అన్నారం, పెన్‌పహాడ్, చీదెళ్ల, దూపహాడ్ గ్రామాల్లో రైతు వేదికలు ఉండగా 15720మంది రైతులు 37వేల ఎకరాల్లో వివిధ పంటల సాగు చేపడుతున్నారు.



అనాజిపురం రైతు వేదిక కార్యాలయం

**కనీస సౌకర్యాలు కరువు**

ఆయా రైతు వేదికల్లో కనీసం తాగడానికి కూడా మంచినీటి సౌకర్యాలు లేవు. చాలా చోట్ల మిషన్ భగీరథ కనెక్షన్లు బిగించినప్పటికీ నీరు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. రైతు వేదికల్లో ఒక స్వీపర్ కూడా లేకపోవడంతో దుమ్ముతో దర్శనమిస్తున్నాయి. ఏఈఓలు చుట్టుపుచూపుగా వచ్చి వెళ్లిపోతున్నారు. కొన్ని రైతు వేదికలకు తాళాలు తీసే దిక్కే లేదు. తీసినా ఒక గంటపాటు ఉండి ఫీల్డ్ విజిట్ పేరుతో ఉడాయిస్తున్నారు. రైతు వేదికల్లో మరుగుదొడ్లు లేక మహిళా ఏఈఓలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. అప్పటి ప్రభుత్వం హడాహుడిగా రైతు వేదికలు నిర్మించి పూర్తి సౌకర్యాలు కల్పించలేదు. అరకొర సౌకర్యాలతో చేతులు దులుపుకున్నారని రైతులు, ప్రజల వద్ద నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా రైతులకు ఉపయోగపడే రైతు వేదికలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండి తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని రైతులు కోరుతున్నారు.

**సౌకర్యాలు కల్పించాలి**



రైతు వేదికల్లో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో మంచినీటి వసతి లేదు. మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఏఈ ఓలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైతు వేదికల్లో సౌకర్యాలు కల్పించి సమస్య పరిష్కరించాలి. స్వీపర్లు, అటెండర్లు లేకపోవడంతో ఏఈఓలు సొంత ఖర్చులతో మెయింటెనెన్స్ చేయిస్తున్నారు. ఏఈఓలు ప్రతి రోజు రైతు వేదికలకు వెళ్లి రైతులకు అందుబాటులో ఉండాలి.

– కృష్ణసందీప్, మండల వ్యవసాయ అధికారి

## అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మందుల సామేల్

**తిరుమలగిరి (తుంగతుర్తి) :** అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ 30చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ రాములు, వైస్ చైర్మన్ కేశిడి సరళాయాదవరెడ్డి, తహసీల్దార్ సుధ, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


తిరుమలగిరిలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

## బోరు బిగింపును అడ్డుకున్న వ్యక్తిపై చర్య తీసుకోవాలి

**నూతనకల్ :** మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామంలో బోరుమోటారు బిగింపును అడ్డుకున్న వ్యక్తిపై చర్య తీసుకోవాలని గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన చిత్తలూరి నారాయణ తన ఇంటి ముందు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన బోరును పంచాయతీకి అప్పగించారని తెలిపారు. బోరుమోటరుకు మరమ్మతులు చేయించి బిగించడానికి ప్రయత్నించగా అడ్డుకున్నట్లు ఆరోపించారు. బోరుమోటారును తక్షణమే బిగించి నీటి సౌకర్యాన్ని పునఃరుద్ధరించాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యదర్శి సుధాకర్‌గౌడ్‌ను వివరణ కోరగా పంచాయతీకి బోరును అప్పగించిన ఒప్పందపత్రాలు ఉన్నాయని, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

## ‘ఉపాధి’ పనులు పారదర్శకంగా నిర్వహించాలి


ఓపెన్ ఫోరంలో మాట్లాడుతున్న ఎంపీపీ మణి


సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

**నాగారం :** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని డీఆర్‌డీఓ మధుసూదనరాజు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో 2023–2024 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై జరిగిన మూడవ విడత సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధి పనుల్లో లోటుపాట్లను సవరించుకుంటూ కూలీలకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. మస్టర్‌లలో కొట్టివేతలు, పంచాయతీరాజ్ రికార్డులు సమర్పించకపోవడం, పనిప్రదేశాల్లో కొలతల్లో తేడాలను గుర్తించారు. పని ప్రదేశాలలో మూడు రకాల ఫొటోలు తీయకపోవడం, రికార్డుల నిర్వాహణ సరిగా లేకపోవడం, కొలతల్లో తేడాలు ఉండటంతో మండలంలోని 14 గ్రామపంచాయతీలకు సంబంధించి రూ.2,40,714ను రికవరీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కూరం మణివెంకన్న, వైస్ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, ఏపీడీ శిరీష, స్టేట్ టీం మానిటర్ నరేందర్, అంబుడ్స్‌మెన్ లచ్చిరాంనాయక్, ఎస్ఆర్‌పీలు సాంబశివచారి, ఎంపీడీవో ధార శ్రీనివాస్, ఏపీవో రవి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించాలని వినతి

**పెన్‌పహాడ్ :** గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆరు నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులు మాట్లాడుతూ ఐదు లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత కేటగిరీలను కొనసాగించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి నెల నెలా వేతనాలు చెల్లించాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని పర్మినెంట్ చేయాలని జీఓ నంబర్ 51ని సవరించాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికునికి దాన సంస్కారాలకు రూ.20వేలు ఆర్థిక సహాయం అందించాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దనియాకుల శ్రీనివాస్, మండల గ్రామ పంచాయతీ యూనియన్ అధ్యక్షులు రణపంగ వెంకన్న, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


యూనిఫాం అందజేస్తున్న హెచ్ఎం ప్రభాకర్

**అర్వపల్లి:** ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని కోడూరు ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ చెప్పారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు బుధవారం యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ గుండెపురి రమణమ్మ, ఉపాధ్యాయులు అశోక్, సాయిలు, రాము, అంగన్‌వాడీ టీచర్లు సునిత, రమణ, వీవోఏ సరళ, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**నేరేడుచర్ల :** పట్టణంలో అనుమతులు లేకుండా నడిపిస్తున్న శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ అన్నారు. బుధవారం నేరేడుచర్లలో నిర్వహించిన పట్టణ పీడీఎస్‌యూ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా కార్పొరేట్ పాఠశాల పేరుతో లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## వేతనాలు మహాప్రభో

- గ్రామపంచాయతీ కార్మికులకు ఆరు నెలలుగా అందని జీతాలు
- ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన

**ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట) :** గ్రామపంచాయతీ కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెక్కాడితే కానీ పూట గడవని పరిస్థితుల్లో ఉన్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలులేకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రతి పని వారి చేతనే చేపిస్తున్న అధికారులు వారికి వేతనం ఇవ్వడంలో మాత్రం జాప్యం చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

**మండలంలో 145 మంది కార్మికులు**

మండల వ్యాప్తంగా 30 గ్రామ పంచాయతీలలో 145 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. గ్రామపంచాయతీలో ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికులది కీలక పాత్ర. గ్రామంలో వీధులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు మురుగు కాలువలో చెత్తాచెదారం తొలగించడం, ఇళ్లిల్లు తిరిగి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్ కు చేర్చడంతో పాటు గ్రామాల్లో పైపులైన్‌ల లీకేజీలు, కరెంటు సమస్యలు తదితరుల పనులన్నీ చేస్తున్నారు.

**ఆరు నెలలుగా..**

మండల వ్యాప్తంగా 145 మంది పారిశుద్ధ కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు అందడం లేదు. వీరందరికీ గ్రామపంచాయతీ నిధుల నుంచి జీతాలు ఇవ్వాల్సి ఉన్నది. కాగా ఇటీవల రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడం, గ్రామపంచాయతీలో పదవీకాలం ముగియడంతో పాటు పలు కారణాలతో నిధులు విడుదల కాకపోవడంతో వీరందరికీ జీతాలు రావడం లేదు. దీంతో వీరంతా ఆర్థికంగా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి తమకు వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు


పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు (ఫైల్)

**ఇబ్బందులు పడుతున్నాం**



ఆరు నెలలుగా జీతాలు అందడంలేదు. జీతం రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుంది. గ్రామ పంచాయతీలో అన్ని పనులు చేస్తున్న తమకు జీతాలు రాకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదు. అధికారులు స్పందించి నెలనెలా జీతం వచ్చేల చూడాలి.

– మూరగుండ్ల వెంకన్న, పారిశుద్ధ్య కార్మికుడు

## ఊరూరా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు


తిరుమలగిరి : రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మందుల సామేల్

**తిరుమలగిరి (తుంగతుర్తి) :** కాంగ్రెస్ పార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు రాహుల్‌గాంధీ 54వ జన్మదిన వేడుకలను ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, వైస్ చైర్మన్ కేశిడి సరళాయాదవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సంకెపల్లి కొండల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వై.నరేష్, పేరాల వీరేష్, జమ్మిలాల్, ఎం.డి.హఫీజ్, రాపాక సోమేష్, సుంకరి జనార్దన్, కౌన్సిలర్లు బత్తుల శ్రీను, ప్రియల తారాము గౌడ్, కుదురుపాక శ్రీలతారాములు, కందుకూరి లక్ష్మయ్య, యాదగిరి పాల్గొన్నారు.

**అర్వపల్లి:** ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం అర్వపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్, శిగ నసీర్‌గౌడ్, మేకల రాంబాబు, బైరబోయిన మహరాజు, అమీనుద్దీన్, బింగి కృష్ణమూర్తి, నల్లగుంట్ల శ్రీనివాస్, దిర్శనపు కృష్ణమూర్తి, రమేష్, మల్లయ్య పాల్గొన్నారు.

**మద్దిరాల :** కాంగ్రెస్ పార్టీ అధినేత, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలుమల్ల యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దెల భిక్షపతి, మాన్‌సింగ్, సాదం శ్రీను, మూమునూరి ఉపేందర్, మద్దెల నరేష్, దగ్గుల మలయ్య, మద్దెల మధు, కూజ ఎల్లేష్, సోమయ్య, చెన్నునాయక్, బాలరాజ్ పాల్గొన్నారు.

**పెన్‌పహాడ్ :** మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శెనగాని రాంబాబు, వెంకటేష్, ఒగ్గు సైదులు, జూకూరి గాంధీ, దొంగరి గోపి, రణపంగ దుర్గయ్య, చంద్రం, సందీప్ పాల్గొన్నారు.

**తుంగతుర్తి:** ఏఐసీసీ నాయకులు, ఎంపీ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, పెండెం రామమూర్తి ఓరుగంటి సత్యనారాయణ, కొండా రాజు, కటకం వెంకటేశ్వర్లు, కటకం సూరయ్య, కిష్టయ్య, జలంధర్, ముత్తిలింగం, ప్రవీణ్‌రెడ్డి, మల్లయ్య, రమేష్, రంజిత్, సుమన్, నాగయ్య, సంజీవ పాల్గొన్నారు.

**నూతనకల్ :** ఏఐసీసీ అగ్ర నాయకుడు, పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పసుల అశోక్ యాదవ్, ఎంపీటీసీ పన్నాల రమమల్లారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, బద్దం ప్రశాంత్‌రెడ్డి, మేడిపల్లి అశోక్, నెల్లుట్ల మహేష్, బొల్క సైదులు, చురుకంటి చంద్రారెడ్డి, మరికంటి శ్రీకాంత్, పాల్గొన్నారు.

**ఆత్మకూర్ (ఎస్) :** ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మండల వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని నిమ్మి కల్లు లో పచ్చిపాల వెంకన్న యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు కార్యక్రమంలో నెమ్మికల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు గంపల కరుణాకర్ సింగిల్ విండో డైరెక్టర్ అద్దంకి జానమ్మ గోపగాని వెంకన్న, సర్వయ్య పాల్గొన్నారు.


అర్వపల్లి : పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు


తుంగతుర్తి: కేక్‌కట్ చేస్తున్న నాయకులు


మద్దిరాల: కేక్ కట్‌చేస్తున్న అవిలమల్లు యాదవ్


నూతన్‌కల్ : కేక్ కట్ చేస్తున్న నాయకులు

## అభివృద్ధే ధ్యేయం : మంత్రి

**నేరేడుచర్ల :** హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయమని, రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిల్లేపల్లి నుంచి సోమారం వరకు రూ.15 కోట్ల వ్యయంతో చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి వద్ద నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణ పనులకు రూ.85 కోట్ల నిధులు మంజూరు అయినట్లు తెలిపారు. అన్ని గ్రామాలకు రోడ్ల సౌకర్యం కల్పించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయించి రైతులకు సాగు నీరు అందేలా కృషిచేస్తానన్నారు. నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో తనను దేశంలోనే అత్యంత మెజార్టీతో గెలిపించినందుకు ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, కొనతం చిన వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

**పూల దారి**



తొలకరి జల్లులు కురవడంతో రోడ్డుకిరువైపులా నాటిన చెట్లు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. వాటికి పూలు పూయడంతో రహదారి అంతా పూలదారిగా మారింది. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని ఉండ్రుగొండకు వెళ్లే దారి వెంట ఉన్న చెట్లకు ఎర్రని పూలు పూసి వాహనదారులతో పాటు అటుగా వెళ్లే వారిని ఆకట్టుకుంటున్నాయి. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

## నేటి నుంచి నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

- జాజిరెడ్డిగూడెం మండలంలో 3,193మంది పిల్లల గుర్తింపు
- పంపిణీకి సిద్ధంగా ఆల్బెండజోల్ మాత్రలు

**అర్వపల్లి:** నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీకి మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే పిల్లల్లో నులి పురుగును నివారిస్తే మెరుగైన ఆరోగ్యం పొందుతారు. ఇందుకోసం పిల్లలను గుర్తించి మాత్రల పంపిణీని చేపడుతున్నారు. ఇప్పటికే మాత్రల పంపిణీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల స్థాయిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

**జాజిరెడ్డిగూడెం మండలంలో..**

జాజిరెడ్డిగూడెం మండలంలో 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు 3,193 ఉన్నట్లు గుర్తించారు. వీరందరికీ గురువారం విద్యాసంస్థలకు వెళ్లి మాత్రలను పంపిణీ చేయనున్నారు. 2 ఏళ్లలోపు పిల్లలకు సగం మాత్ర, 2ఏళ్ల పైబడి 19 ఏళ్ల వరకు వారికి ఒక మాత్ర వేయనున్నారు. అయితే ఈ సందర్భంగా తొలిరోజు మాత్రలు వేసుకోని వారికి వైద్య సిబ్బంది ఇళ్లకు వెళ్లి వేయనున్నారు.


కుంచమర్తి ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

**పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు వేయించాలి**



19 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలి. అయితే పిల్లలు ఎక్కువ మంది నులి పురుగులతో బాధ పడుతుంటారని తద్వారా అనేక ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యతో పిల్లల్లో శారీరక ఎదుగుదల లేకపోవడం, కడుపునొప్పితో బాధపడటం, చదువుల్లో శ్రద్ధ చూపకపోవడం, రక్తహీనత, తరచూ ఆనారోగ్య సమస్యలు ఏర్పడతాయి. ఈమాత్రలు వేసుకుంటే నులి పురుగుల సమస్య రాదు.

– డాక్టర్ సీహెచ్.మణిదీప్, వైద్యాధికారి